

# ముద్దూ-ముశిపెము

"మిమ్మల్నే...."

రవ్వలాంటి కంఠం వినబడేటప్పటికి వాష్ బేసిన్ దగ్గర ముఖం కడుక్కుంటున్న గోపాలం తలెత్తి చూశాడు. అద్దంలో ఆ అమ్మాయి నవ్వుతూ కన్పించింది. తనను చూసి ఎవరనుకుందో! పొరపాటు పడి ఉంటుంది. వ్యక్తిని పోలిన వ్యక్తి ఉండటం సహజమే. అయితే తిరపతి నుండి వచ్చేవాళ్ళు అందరూ ఒకలాగానే ఉంటారు. గోపాలం తడిచేత్తో గుండు తడిమి చూసుకున్నాడు. అబ్బ! ఎంత హాయిగా ఉంది. ఎండాకాలం ఇట్టే చక్కా ఎగిరిపోయింది.

"మిమ్మల్ని గుర్తుపట్టలేదనుకున్నారా! భలేవారే బస్సుస్టాండులో కలవలేదూ...."

గోపాలం వెనక్కి తిరిగి చూశాడు. ఆ అమ్మాయే. బస్సు స్టాండులో వీపుకు వీపు అనించి కూర్చుంది. బిడ్డకు పాలిస్తోంది. నయం తనవైపు తిరిగింది కాదు. ఆ అమ్మాయి వాలకం నచ్చలేదు తనకు. పక్కన మొగుడే అయి ఉండాలి-బటాణీలు తింటూ అస్తమానం గడియారం వంక చూసుకుంటున్నాడు. నిమిషానికి ఎన్ని బటాణీలు తినొచ్చునో లెక్కవేసుకుంటున్నాడు గాని పెళ్ళాం ఎవడిని అనుకుందో చూద్దామన్న జ్ఞానం లేదు. ఇట్లాంటి సిగ్గులేని మనిషితో ఎట్లా సంసారం చేస్తున్నాడో ఏమో! అయితేనేం ముగ్గురు పిల్లలు. ఇద్దరికి గౌన్లు, మూడో శాల్తీకి చొక్కా నిక్కరు వేసి పూలజడ వేసింది. ఆడపిల్లో మగపిల్లవాడో! ఎవరయినా తనకేం బాధలేదు గాని సంశయ నివృత్తికాక మనస్సు పీకుతోంది.

రైలు వంతెన దాటుతున్నట్లుంది. పెద్దగా చప్పుడు చేసింది. గోపాలం గుర్తు తెచ్చుకున్నట్లుగా బుర్ర గోక్కుని.... "ఆ....అవును.... మీవారేరీ...." అనడిగాడు. ఆయన యోగక్షేమం కనుక్కుందామని కాదు, పక్కనే ఉండి ఈ మాటలని వింటున్నాడేమోనని భయం.

"మావారా...ఆ పైబెర్తుమీద పడుకుంది వారే... పైగా బ్రహ్మచెముడు..."

ఆ మాట ఎందుకు చెప్పింది ఇప్పుడు! గోపాలం కాస్త ధైర్యంగా, పరిశీలనగా చూశాడు. మనిషి గోమేధికంలా ఉన్నది, పెదవులు కెంపుల్లా ఉన్నాయి. ముక్కు వజ్రపు ముక్కలా ఉంది. తను రత్నాల వ్యాపారి. అద్దంలో తన గుండు మెరుస్తోంది. రైలు కుదుపుకు ఆమె ముందుకు, వెనక్కూ వూగుతూ జారిపోతున్న బిడ్డను పైకిలాక్కుంటూ నానాఅవస్థ పడుతోంది. ముందుకు వచ్చి కాసిని నీళ్ళు నోట్లో పోసుకుంది. ముఖం కడుక్కుంది. కొంగుపెట్టి ముఖం తుడుచుకుంది. తనని జరగమని చెప్పొచ్చుగా! ఏమిటీ ఈ మీద పడిపోవటం. తనకీ జరగాలని అనిపించలేదు. రైలు కుదుపుకు ఆవిడ తగులుతూనే ఉన్నది. ఇంతలో నెత్తిమీద రప్పున దెబ్బపడింది. కంగారుపడ్డాడు. ఆవిడ మొగుడు లేచివచ్చాడా! చంకలో బిడ్డ కేరింతలు వినబడ్డాయి.

"ఛీ... దొంగకన్నా... అట్లా కొట్టొచ్చునా..." బిడ్డ చెయ్యి వెనక్కు లాగింది. ఈ చనువు, సరాగం గోపాలానికి నచ్చలేదు. చిర్రెత్తుకొచ్చింది. చాచికొట్టాలన్నంత కోపం వచ్చింది. ఎవరిని కొట్టినా కందిపోయేట్లున్నారు.

"ఫరవాలేదులెండి..." అంటూ దెబ్బ తగిలిన చోట చేత్తో రాసుకున్నాడు. ఆమెగూడా అతని గుండుమీద చేత్తో రాసి, "సారీ అండీ..." అంది. గోపాలం గుండెల్లో రైళ్ళు పరుగెత్తినాయి. క్షణంలో నెప్పి మాయమయింది. ఆ స్పర్శ మానవస్పర్శలా లేదు. ధన్వంతరి పంపిన దేవకాంత మృదుహస్తంలా కోమలంగా ఉంది. ఆమె బిడ్డను బ్రతిమిలాడి ఇంకో రెండు దెబ్బలు వెయ్యమని అడగాలనిపించింది.

"మీపేరు గోపాలం కదూ... నా పేరు పార్వతి... మీరు హైదరాబాదులో ఏం చేస్తుంటారు...?" దారిలో చెక్కపెట్టెమీద కూర్చుంది. కింద కూర్చున్న సర్దార్జీ దూరం జరిగాడు.

"పేరు కనుక్కున్నారు. ఊరు కనుక్కున్నారు. ఏం చేస్తానో కనుక్కోలేరా..." గోపాలం ధైర్యంగా సంభాషణలోకి దిగాడు.

"మీ సూటుకేసుమీద... ఏం చేస్తుంటారో వ్రాయలేదు గదా..." పార్వతి ఎంతోకాలంగా పరిచయం ఉన్నదానిలా మాట్లాడుతోంది.

"చేసే పని టైముని బట్టి ఉంటుంది. చూడండి... ఉదయం ఆరింటికి పళ్ళు తోముకుంటాను... ఆరున్నరకు కాఫీ తాగుతాను... రాత్రి ఎనిమిది గంటలకు భోజనం చేస్తాను. రాత్రి పదింటికి..."

"ఆపండి.... ఆపండి... అందరూ చేసే పనులు చెప్పనక్కరలేదు... ఉద్యోగం ఏమిటి..." పార్వతి కళ్ళు మెరుస్తున్నాయి.

"ఇదే మీ స్లీపరుకోచ్ లాగా లేదు... రాదారి పడవలాగా ఉంది... ఏమిటయ్యా... ఎక్కడపడితే అక్కడ కూర్చుంటే రిజర్వేషను ఉన్నవాళ్ళు ఏమయిపోవాలి..." పక్క వరసలో టిక్కెట్టు కలెక్టరు అరవటం వినిపించింది. గోపాలానికి ప్రాణం లేచివచ్చింది.

కిందటి స్టేషనులో డబ్బు తీసుకొని బెర్తు ఇప్పిస్తానన్నవాడు ఈయనే కావచ్చు.

"మీరంతా పై స్టేషనులో దిగిపోవాలి... జనరల్ పెట్టిలో ఎక్కండి... నన్నేం చేయమంటారయ్యా... సీటులేదు... బెర్తులేదు..."

గోపాలం టిక్కెట్టు తీసి అతనికి చూపించాడు.

"మీకు బర్తు ఛార్జీలు ఇచ్చాను... చిల్లర లేక ఇరవై రూపాయల కాగితం ఇచ్చాను..."

"నీ చిల్లర పట్టుకుని పారిపోనులేవయ్యా..." టికెట్టు కలెక్టరు రిజర్వేషను చార్టు చూడబోతుంటే పదిచేతులూ, పదిరూపాయల నోట్ల కాగితాలతో జనం మీద పడిపోతున్నారు.

"డబ్బులేనివాడు బోటు ముందరెక్కాడుట... అట్లా ఉందయ్యా... బర్తులు లేవయ్యా... మొగుడా అంటే... ఇదేమన్నా లంకలో లాడ్జిటయ్యా... మడతమంచాలు వేయించటానికి... ముందు నన్ను సర్దుకోనియ్యండి... ఆడవాళ్ళు, పిల్లలున్నారు... తొక్కేస్తారయ్యా..." టిక్కెట్టు కలెక్టరు మీద పడిపోతున్నవాళ్ళని పర్యాలోకించాడు. అందులో కొంతమంది తనకు బెర్తులకోసం డబ్బులు, ముడుపులు ఇచ్చారు. ఎవరెవరో తెలియటం లేదు. టిక్కెట్టు నంబరు రాసుకున్నాడుగాని మనుష్యులను గుర్తుపట్టడం కష్టం. తిరపతి నుండి తిరిగి వచ్చేవాళ్ళంతా తనలాగా ఉండటం టిక్కెట్టు కలెక్టరుకు గూడా మహా ఇబ్బందిగా ఉంది. అంతా తలొకరకం టోపీలన్నా పెట్టుకోవాలి. కాకపోతే గుండుమీద సున్నంతో ఒకటి, రెండూ నంబర్లన్నా వేయించాలి. కాకపోతే తనీ ఉద్యోగం చేయలేడు. శుభ్రంగా కొవ్వూరు వెళ్ళి లాంచి నడుపుకుంటాడు.

పార్వతి పిల్లల్ని వొకపక్క సర్ది మొగుడితో పడుకోమని, కదలవద్దని సంజ్ఞలు చేస్తోంది. బెర్తుల పంపకం అయింతర్వాత గోపాలానికి బెర్తు నంబరు వచ్చింది.

"రిజర్వేషన్ లేనివాళ్ళంతా గూడూరులో దిగిపోవాల్సిందే..." టిక్కెట్టు కలెక్టరు డబ్బులు సర్దుకుంటున్నాడు.

"మేం సర్దుకుంటాం లెండి..." పార్వతి ఓ నవ్వు విసిరి టిక్కెట్టు కలెక్టర్ ముఖాన పడేసింది.

"మీరు సర్దుకోవడం కాదు... ఒక్క బర్తే ఇచ్చాను ఈయనకు..." గోపాలం వంక చూసి "ఇంతమంది ఉన్నామని ముందే చెప్పద్దుటయ్యా... నన్ను ఇరకాటంలో పెట్టేస్తారు... అటు ఒడ్డా కాదు... ఇటు పడవా కాదు... ముందు నీ బెర్తు నంబరు చూసుకో..."

గోపాలం ఎవర్నీ ఏమీ అనలేక తన బెర్తు నంబరు వెతుకుతూంటే, అది కాస్తా పార్వతి మొగుడు పడుకున్న బెర్తు అయింది. టిక్కెట్టు కలెక్టరు నల్లేరుమీద బండిలాగా, సముద్రం అలల పైన నడిచే హోవర్ క్రాఫ్టులాగా, మనుష్యులు, సామాన్లు మీద తేలిపోతూ లంఘించి గోపాలం బెర్తు దగ్గరకు వెళ్ళాడు.

"కట్టుకున్న మొగుడిలాగా మంచం ఎక్కాడు... దిగవయ్యా దిగు..." పార్వతి ముందుకు వచ్చేసి టిక్కెట్టు కలెక్టరు కోటు పట్టుకుని లాగింది. "వారికి వంట్లో బాగాలేదు..." అంది.

"ఎవరు... ఈయన మీవారా...? మరి ఆయన ఎవరు...?"

"వారు... మా ఊరు..."

గోపాలం అవాక్కయ్యాడు.

"మేం సర్దుకుంటాం లెండి..." పార్వతి టిక్కెట్టు కలెక్టరుకు ధైర్యం చెప్పింది.

"మీ బెర్తు చూపించాను... ఆయన్ని దింపమంటే దింపేస్తాను... ఏరు దాటిం తర్వాత నన్ను అంటే ఏం లాభం లేదు..."

గోపాలం పార్వతి వంక చూశాడు.

"మీరు హైదరాబాదులో... చేసే ఉద్యోగం ఏమిటో చెప్పలేదు..."

పార్వతి గోపాలంతో చనువుగా మాట్లాడటం చూసి టిక్కెటు కలెక్టరు డబ్బులు లెక్కపెట్టుకుని వెళ్ళిపోయాడు.

"ఈ పెట్టెమీద కూర్చోండి. మాదే పెట్టె...!"

"స్టేషను రాగానే మావారిని మెల్లగా దిగి ఈ మూలగా కూర్చోమని చెపుతాను... బెర్తుమీదకు మీరు వెళుదురుగాని..."

గోపాలం పార్వతి వంక సాలోచనగా చూశాడు. నెరజాణ.చౌక్కా, నిక్కరు, పూలజడ, బిడ్డ చంకలో పైకీ, కిందకూ జారుతున్నాడు. గోపాలం మెల్లగా పెట్టెమీదకు జొరవడ్డాడు. పార్వతి తన బిడ్డను అందించింది అతనికి.

"ప్రయాణం తొక్కిడిలో... చీర జారిపోయేట్టు ఉంది..." అంది నవ్వుతూనే... చీరె సర్దుకుని జుట్టు పైకి ముడివేసుకుంది. "పిల్లల మధ్య ఎడం లేకపోతే ఇదే అవస్థ అండి... ముగ్గురు పిల్లలు. పెద్దదానికి మూడో ఏడు రాలేదు..."

తనతో ఎందుకుచెపుతోంది... ఆడపిల్లలకి వయసు వ్యత్యాసం లేకపోతే తన బాధ్యత ఏమిటో గోపాలానికి అంతు చిక్కలేదు. "కొంచెం .. ఆ డబ్బా అందుకుంటారూ"

గోపాలానికి కూర్చున్నంతసేపు పట్టలేదు లేవటానికి. డబ్బా అందుకున్నాడు. ఆ డబ్బా మూత తీస్తే పాలసీసా, పంచదార డబ్బా, చెంచాలు, చిన్న గ్లాసూ, చక్కిలాలూ... ఓ మంత్రగాడి పెట్టెలాగా ఉన్నది. తీస్తున్నకొద్దీ సామాన్లు వస్తున్నాయి. ఓ చక్కిలం తీసి గోపాలం చేతిలో పెట్టింది.

"చక్కిలం తినమంటే పళ్ళు లాగుతాయంటారు మావారు... చక్కిలాలు వొకచోట, గట్టి దవడలు వొకచోట... అని కాళోజీ మావారిని చూసే రాసి ఉంటారు..."

గోపాలం చక్కిలం చేత్తో పట్టుకున్నాడు గాని తినటానికి మొహమాటపడుతున్నాడు.

"అదేమిటి! తినండి... చక్కిలాలు పటపట నమిలి తింటుంటే... ఆ చప్పుడు... అబ్బ ఎంత బాగుంటుందో..."

గోపాలం చక్కిలం నోట్లో పెట్టుకుంటే గాలానికి గుచ్చిన ఎరను చప్పరించిన చేపలాగా సంబరపడిపోయాడు.

"మీరు ఏమీ అనుకోకపోతే గూడూరులో కాసిని వేడినీళ్ళు తెచ్చిపెట్టాలండీ... మావారిని నిద్ర లేపేటప్పటికి నెల్లూరు దాటిపోతుంది..."

గోపాలం గొంతులో చక్కిలం అడ్డుపడ్డట్లయింది.

గూడూరులో బెర్తు ఖాళీ చేసే మాట ఖాళీ అన్నమాట. తాను హైదరాబాదు చేరేదాకా దారిలో పెట్టెల మధ్య కునికిపాట్లు పడాల్సిందే. చక్కిలం గాలంలాగా గొంతుకు గుచ్చుకుంటోంది.

"మీరు ఏం ఉద్యోగం చేస్తున్నారో చెప్పారు కారు..."

పార్వతి అడుగుతుంటే సమాధానం చెప్పక తప్పేట్లు లేదు. "బ్యాంకులో పని చేస్తున్నాను."

పార్వతి కళ్ళు పెద్దవైనాయి. "నిజమా అండి... బ్యాంకు ఉద్యోగం అంటే నాకు పంచప్రాణాలు... నోట్లు లెక్కపెట్టిన చేతులంటే పరవశించిపోతాను... మావారూ ఉన్నారు..."

"మీవారేం చేస్తున్నారు..." గోపాలం విధి బలీయమని తెలుసుకున్నాడు.

"బతకలేక బడిపంతులు అంటారు... అదీ ఉద్యోగం... చేతులంతా చాక్‌పీసు వాసన...

పిల్లల్ని పేము బెత్తంతో కొట్టి కొట్టి కాయలు కాసిన చేతులు తలచుకుంటేనే కంపరం .."

రైలు మెల్లిగా ఆగుతోంది. గూడూరు వచ్చినట్లుంది. గోపాలానికి మరచెంబు చేతికిచ్చింది. అతను లేచి నిలబడ్డాడు. మెల్లిగా గుమ్మం దగ్గరకు బయలుదేరాడు.

"సూటుకేసు జాగ్రత్తండి..."

"అన్నట్టు స్టీలు కారియరుతో మీల్సు గూడా పట్టుకువస్తారా ఏమీ అనుకోకపోతే... మీరూ మాతోటే భోజనం చేయవచ్చు..."

గోపాలం అనుకోవటానికేం లేదు. నిండా మునిగినవాడికి చలి ఉండదుట. నిజానికి చెమట వస్తోంది.

రైలు ఆగుతూండగానే గోపాలం దిగి పరుగెత్తాడు. దగ్గరలో పోలీసులుంటే అతన్ని చూసి దొంగ అనుకుని వెంబడిపడేవాళ్ళే.

భోజనశాల ఎక్కడుందో. ఇద్దర్ని అడిగితే తలొకదిక్కూ చూపించారు... ఒకటి వెజిటేరియన్. మరొకటి నాన్ వెజిటేరియను. తర్వాత తెలిసింది.

"రెండు భోజనం.. " హోటలులో మేనేజరుకు కారేజీ అందించాడు.

"ఎన్నయ్యా... నా నెత్తిమీద దా పెట్టు" అన్నాడు మేనేజరు కారియరు చూపిస్తూ. పార్వతి భోజనానికి డబ్బివ్వలేదు. కారియరు పెట్టి మేనేజరు నెత్తిమీద కొట్టాలన్నంత ఉక్రోషం వచ్చింది. మేనేజరు కోరికా తీరుతుంది.

"కారియరు కింద పెట్టయ్యా..." మేనేజరు గట్టిగా అరిచేటప్పటికిగాని గోపాలం బుర్ర పనిచేయలేదు. గబుక్కున కారియర్ తీసి కింద పెట్టాడు.

"కొంచెం వేడినీళ్ళు కావాలండి" మరచెంబు టేబిలుమీద పెట్టకుండా చేతితోనే పట్టుకున్నాడు గోపాలం.

"స్నానం చేయటానికా... తాగటానికా" మేనేజరు మండిపడ్డాడు. అక్కడ సర్వరు ఒకడు తన కష్టం తెలిసినవాడులా కనిపించాడు. "నేనిప్పిస్తా రండి" అంటూ వంటగది దగ్గరకు తీసుకుపోయాడు. ఎసరు కాగుతున్న గుండిగలో నుంచి చెంబునిండా నీళ్ళు పోయించి ఇచ్చాడు. తను మేనేజరు కిచ్చిన కారియరు అక్కడ ఉన్నదో ఎవరన్నా పట్టుకుపొయ్యారోనన్న అనుమానం వేసింది. కాలిపోతున్న మరచెంబు ఒకచేత్తో పట్టుకుని రెండోచేత్తో మర బిగిస్తూ పరుగెత్తుకు వచ్చాడు. ప్లాటుఫారం మీద రైలుకూతలు వినిపిస్తున్నాయి. వాన రాకడ, రైలు పోకడ ఎవరికీ తెలియదు. మేనేజరుకు రెండు భోజనాలకి డబ్బిచ్చాడు. ఆ టేబులు పక్కన మూడు కారియర్లున్నాయి. తనది ఏ కారియరు. గుర్తుపట్టలేదు. ఒక క్షణం నిలబడ్డాడు. అక్కడే ఉన్న వాళ్ళిద్దరూ తలొక కారియరు పట్టుకుపోగానే మిగిలిన కారియరు తాను తీసుకుని బయలుదేరాడు. రైలు పెట్టెలోకి చేరేటప్పటికి బెర్తుమీద పడుకున్న పార్వతి భర్త ఇటుతిరిగి మాట్లాడుతున్నవాడు గోడవైపు తిరిగి దుప్పటి పైకి లాక్కున్నాడు. రైలు బయలుదేరింది.

పార్వతి పిల్లలను పక్కకు చేర్చి కారియరు తీసి అన్నం కలిపి పెట్టింది. "మీరు గూడా తినండి... మిగిలితే మావారికి పెడదాం..." గోపాలం అన్నం తినడానికి ఇష్టపడలేదు. చొక్కా నిక్కరు వేసిన బిడ్డను గోపాలానికి అందించింది. వళ్ళో కూర్చోపెట్టుకున్నాడు. ముగ్గురికి అన్నం నోట్లో పెడుతోంది.

ఎవరి పనిలో వాళ్ళున్నారు. వీళ్ళ మాటలు ఎవరికీ వినబడ్డం లేదు. "మీకెంత మంది

పిల్లలు?" గోపాలం వినిపించుకోనట్టుగా "మీ అబ్బాయికి పుట్టువెంట్రుకలు తిరపతిలో తీయించక పోయినారా" అన్నాడు.

"అబ్బాయి ఎక్కడండీ... ముగ్గురూ ఆడపిల్లలే..." మూడోపిల్ల జడలో పూలు జారిపోతోంటే పైకి సర్ది పిన్నీసు పెట్టింది. "అయ్యో మా సంసారానికి మగపిల్లలు కూడానా... మీకెంతమంది పిల్లలు చెప్పారు కాదు"

"ఇద్దరు కొడుకులు..."

"దేనికయినా అదృష్టం ఉండాలి... మీ వంటి భర్త దొరికితే... చెట్టుకిందయినా ఆనందంగా గడిపెయ్యవచ్చు..."

గోపాలం ఆమెవంక సూటిగా చూడలేక కళ్ళు మూసుకున్నాడు. తాను చెట్టుకు చేరగిలబడినట్లు పార్వతి చెట్టుకొమ్మకు చీర కట్టి అందులో బాబుని పడుకోబెట్టి ఊపుతూ జోలపాట పాడుతోంది. 'చిన్న గోపాలుడా నిద్రపోవయ్యా...'

గోపాలానికి నిద్ర తూగు వచ్చింది.

"అమ్మాయికి చెయ్యి, మూతి కడిగివస్తాను..." పార్వతి లేచింది. వాష్‌బేసిన్ దగ్గరికి పిల్లలను ఒక్కొక్కళ్ళనే అందించాడు. వాళ్ళను వెనక్కు తీసుకుని వచ్చి పెట్టెల పక్కనే దుప్పటి సర్ది పడుకోబెట్టింది. తను కొంచెం అన్నం తిని గోపాలాన్ని తినమని బలవంతం చేసింది. భోజనం డబ్బులు తనే ఇచ్చాడు. ఆ డబ్బు మాటే లేదు. పైగా తన సొమ్ము ఇస్తున్నట్లుగా ఆదరం. దొక్కిందే దక్కుడు అని గోపాలం కొంచెం సాంబారు అన్నం తిన్నాడు.

"నెల్లూరు రాగానే కాస్త మంచినీళ్ళు తెచ్చిపెట్టాలి..." బ్రతిమిలాడే స్థితి పోయి ఆజ్ఞాపించే పరిస్థితి వచ్చినట్లుంది. నెల్లూరు స్టేషను రాగానే మరచెంబు మంచినీళ్ళ కోసం ఇచ్చింది. పాలు కలిపి మరొక స్టీలు డబ్బాలో పోసింది.

"ఒక ఫ్లాస్కు కొనమంటే కొనడండి... అన్నిటికీ సర్దుకుపోవాల్సిందే... మీరు వచ్చేటప్పుడు ఓ సిగరెట్టు పెట్టె కూడా తెచ్చిపెట్టండి... గోల్డు ఫ్లేకు... అంటారు. ఈయన పుణ్యమా అని సిగరెట్ల పేర్లు తెలుస్తున్నాయి... మీరు సిగరెట్లు కాలుస్తారా?"

"ఊహూఁ..." తల అడ్డంగా ఊపాడు గోపాలం.

నెల్లూరు స్టేషనులో రైలు ఆగకుండానే పార్వతి మళ్ళీ చెప్పింది. "స్టేషను మాస్టరుగా పనిచేస్తున్నాడు... సాంబం అనీ... నేను వచ్చినట్లు కాస్త చెప్పండి... మా మేనత్త కొడుకు. చూసి చాలా కాలం అయింది..."

గోపాలానికి రైల్లోంచి దూకేద్దామనిపించింది.

"ఎట్లా గుర్తుపట్టడం..." సందేహం వెలిబుచ్చాడు.

"మీరు దూరాన్నుంచే గుర్తుపట్టవచ్చు. రైలు ఇంజను కంటే ఎక్కువ పొగ వదులుతుంటాడు... అన్ని సిగరెట్లు కాలుస్తాడు."

స్టేషను మాస్టరు రూము ఎక్కడ ఉందో! చల్లటి మంచినీళ్ళు ఎక్కడ దొరుకుతాయో! ధూమకేతువుకు గోల్డుఫ్లేక్ సిగరెట్లు కొనడానికి టైం సరిపోతుందో... గోపాలానికి ఏమీ తోచలేదు.

ధైర్యే... సాహసీ... అన్నారు. రైలు ఆగగానే కిందకు దిగి స్టేషను మాస్టరు గది దగ్గరకు పరుగెత్తాడు. పార్వతి చెప్పిందాంట్లో కొంత సత్యం ఉంది. పొగ ఉంగరాలు, ఉంగరాలుగా బయటకు వస్తోంది. అతన్ని కలిసి పార్వతి విషయం చెప్పాడు. అక్కడ రైల్వేకూలికి మరచెంబు ఇచ్చి మంచినీళ్ళు

తెమ్మన్నాడు స్టేషను మాస్టరు. "మీరు సిగరెట్లకోసం ఏం పరుగెత్తుతారు..." నా దగ్గరున్న సిగరెట్టు ఒకటిద్దాం పదండి.." సాంబం గోపాలం వెంట నడిచాడు. ఇంతలో రైల్వేకూలీ ఒకడు వచ్చి ఏమిటో హడావుడిగా చెప్పాడు స్టేషను మాస్టరు చెవిలో. రెండు సిగరెట్లు చేతిలో పెట్టి... "ఆయనకివ్వండి వస్తాను... ఇప్పుడే..." అంటూ రైల్వే కూలీతోపాటు పరుగెత్తుతున్నట్లుగా వెళ్ళిపోయాడు. సిగరెట్లు చేతిలో పాముల్లాగా కదులుతున్నాయి. ఎప్పుడూ సిగరెట్టు ముట్టుకున్నవాడు కాదు. మరచెంబు పట్టికెళ్ళిన కూలీకోసం పరుగెత్తాడు. ప్లాటుఫారం చివరగా కుళాయి దగ్గర కనిపించాడతను. అతని దగ్గరకు పరుగెత్తికెళ్ళి నీళ్ళు పట్టుకుని వచ్చేటప్పటికే బండి బయలుదేరింది గబుక్కున ఎదురుగా ఉన్న పెట్టెలోకి ఎక్కేశాడు. రైలులో పెట్టెలోంచి పెట్టెలోకి నడుస్తూంటే తన పెట్టె ఎక్కడుందో గుర్తు తెలియటం లేదు.

కొంత దూరం పోగానే పార్వతి ఎదురువస్తూ కనిపించింది. పిల్లలు పడుకున్నారు. భర్త బెర్తుమీద ఉన్నాడు. తనకు ఎదురు నడిచి చేతిలో మరచెంబు అందుకుంది. సిగరెట్లు తీసుకుంది. అతని కళ్ళల్లోకి సూటిగా చూసింది.

"నాకు మొదటినుంచి కలలు కనటం అలవాటు..." పార్వతి అతి సన్నిహితంగా నిలబడింది.

"పగలా... రాత్రా..." గోపాలానికి ధైర్యం వచ్చింది.

పార్వతి ముసి, ముసి నవ్వులు నవ్వింది.

"అర్థం చేసుకునే భర్త కావాలని, ఆరడుగులు, ఆజానుబాహువు అయి ఉండాలనీ, రోడ్డు పట్టనంత పెద్ద కారు ఉండాలనీ, బంగళాలో డబల్‌కాట్ మంచాలు, చుట్టూ ఉద్యానవనాలు, భర్త కారులో దిగి లోపలకు వస్తుంటే ఆ బూట్ల చప్పుడు వినాలనీ... మావారికి కనీసం బూట్లు కొనుక్కుందామన్న కోరిక గూడా లేదు..."

"నేనూ కలలు కనేవాణ్ణే... ఎప్పుడూ కలల్లోనే జీవిస్తుంటాను. మధ్య మధ్య...గోపాలంలో దాక్కునిపోయిన కథారచయిత తొంగి చూశాడు గానీ... నా కలల్లో బంగళాలు, కార్లూ లేవు... సెలయేళ్ళూ మీలాగా చలాకీగా ఉండే అందమైన భార్య... నది వడ్డున ఇసుక తిన్నెల్లో... వెన్నెట్లో వెండిలా మెరిసే అలలమీద మనస్సు పరుచుకుంటూ ... ఆకలిదప్పుల్ని మరచి... ఈ విశాల విశ్వాన్ని బంధించిన కాలాన్ని, పరిధుల్నీ తెంచివేసి... దృగ్గోచరంగాని సృష్టి చిత్రాన్ని మనోనేత్రంతో పరికిస్తూ ఇద్దరూ ఒకటై... అంతా మరిచిపోయి... రెండు గుండెలు ఒకటై స్పందిస్తున్న సమయంలో... సృష్టి నిలిచిపోతుంది. కాలం ఆగిపోతుంది... గోపాలం కళ్ళు తెరిచేలోపున అతని పెదిమలకు వెచ్చటి ఊపిరి తగులుతోంది. తననెవరో లతలాగా పెనవేసుకున్నారు. గోపాలం ఉలిక్కిపడ్డాడు. పార్వతి వెనక్కు తగ్గింది.

"ఏమిటయింది..." గోపాలం నివ్వెరపోయాడు.

పార్వతి కళ్ళు దీపాల్లాగా మిరుమిట్లుగొలుపుతున్నాయి. ముఖం అంతా సిగ్గుతో ఎర్రగా కందింది. పెదిమలు వణుకుతున్నాయి.

ఒక క్షణం అట్లాగే నిలబడిపోయారు.

గంభీరంగా మాటా, పలుకూ లేకుండా తాము కూర్చున్న చోటుకి అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళిపోయారు. పిల్లలు నిద్రపోతున్నారు.

గోపాలం చాలాకాలంగా కథలు వ్రాయటం మానేశాడు. తానిప్పుడు ఇంటికి వెళ్ళగానే కథ ఒకటి వ్రాస్తాడు.

"సినిమాల్లోలాగా... ముద్దు పెట్టుకుంటే పిల్లలు పుడితే ఎంత బాగుంటుంది..." పార్వతి తలవంచుకుని మెల్లిగా అంది. గోపాలం మళ్ళా ఒకసారి రైలుదిగి మరచెంబుతో మంచినీళ్ళు తెద్దామనుకున్నాడు. ఎవరో గొలుసు లాగినట్లున్నారు. రైలు అకస్మాత్తుగా పెద్ద చప్పుడు చేసుకుంటూ ఆగింది. బెర్తుమీద పడుకున్న భర్త ఒక్కసారిగా లేచి కూర్చున్నాడు.

"అన్నం తింటారా..." అంది పార్వతి.

"ముందో సిగరెట్టు ఇయ్యి..."

"రైల్లో నిద్రపోకుండా... తెల్లవార్లూ కథల కోసం ప్లాటు వెతుకుతుంటావు కదా... ప్లాటు ఏమన్నా దొరికిందా..."

ఆయన సిగరెట్టు ముట్టించాడు.

గోపాలం నివ్వెరపోయాడు "ఈమె కథలు వ్రాస్తుందా?".. పార్వతి కారియరులో ఉన్న భోజనం అందిస్తూ "ఆ దొరికింది" అంది. నవ్వితే బుగ్గలు సొట్టలు పడుతున్నాయి. పెదిమల చివర చిరునవ్వు తొంగిచూస్తోంది.

గోపాలం మంచినీళ్ళ మరచెంబు ఆయనకు అందిస్తూ "కథకు మంచి పేరు కూడా కుదిరిందండి... ముద్దూ... మురిపెమూ" అన్నాడు.

**(జ్యోతి - దీపావళి ప్రత్యేక సంచిక-1984)**